# శ్రీ రమణ జ్యోతి

సంపుటి-45 సంచిక - 3 హైదరాబాదు మార్చి, 2024 పేజీలు - 52 రూ. 10/- సంవత్సర చందా : రూ. 100/-

# SRI RAMANA JYOTHI

Vol - 45 Issue - 3 Hyderabad March, 2024 Pages - 52 Rs. 10/- Annual Subscription Rs. 100/-



**BHAGAVAN SRI RAMANA MAHARSHI**



*ARUNACHALA HILL* (అరుణాచల గిరి)

స్మరణమా త్రముననె పరముక్తి ఫలద । కరుణామృ తజలధి యరుణాచ లమిది ॥

**శ్రీ రమణ జ్యోతి**

మార్చి 2025

ఈ సంచికలో ...

# Sri Ramana Jyothi

March 2025

IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 127వ ప్రవచనం** | వి. రామదాస్ మూర్తి | 3 |
| **2** | **సంభాషణం** | సరోజా ప్రసాద్ | 8 |
| **3.** | **స్వామి దేశికానంద** | రవికృష్ణ శర్మ | 10 |
| **4.** | **భగవాన్ భక్తులు - గోవులు** | వి. రమేష్ బాబు | 17 |
| **5.** | **శ్రీ రమణ మహర్షి సూక్తులు** | కమలాకర వేంకటరావు | 27 |
| 6. | Right Thoughts Vs. Right Thinking | Dr K Subrahmanian | 30 |
| 7. | Ashtavakra Gita 34 | V Krithivasan | 38 |
| 8. | Santha Rangachary | Sneha Choudhury | 42 |
| 9. | Avudai Akkal | V Krithivasan | 49 |


## Events in Sri Ramana Kendram in March 2025

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 9th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
4. 4th April - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు, e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేసి తెలియజేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)


© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.



**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**

**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# వసుధైవ కుటుంబకం

కే.యస్. గారి 127వ ప్రవచనం

అనువాదం: వి. రామదాస్ మూర్తి

మనం గొప్పవాళ్ళనుకునే వాళ్లకూ, మామూలు వ్యక్తులకూ మధ్య తేడా ఏమిటి? ఈ విషయంలో మహాభారతంలో "ఉదార చరితానామ్" అనే పదం వాడబడుతోంది. సాధారణ వ్యక్తులు-ఇది నాది, అది నాది, ఫలానాది నా స్వంతం అని చెప్పుకుంటూ పోతారు. ఇది నా కలం, ఈ ఇల్లు నాది అంటాము. గొప్పవాళ్ళు - ఉదార చరితులు - ఈ మొత్తం విశ్వం - అంతా తమ కుటుంబంగానే భావిస్తారు.

కుటుంబం అంటే ఏమిటి? మనం సాధారణంగా రక్త సంబంధీకుల సమూహాన్ని కుటుంబంగా భావిస్తాము. కుటుంబ సభ్యులు, ఉమ్మడి ఆస్తి, ఇతర విషయాలలో ఒకే అభిప్రాయాన్ని కలిగి ఉండి, అంతా అందరిదిగా భావించడం మంచిది. కాని అలా జరగకుంటే, నీది, నాది అన్నది ఏర్పడుతుంది. ఇతరులతో దేనినైనా పంచుకొనడం అన్నదానిలో ఎంతో సంతోషం ఉంటుంది. అలాగ కాకుండా, ఏదో నా స్వంతం అని అనుకుంటే సమస్యలు ఏర్పడతాయి. ఇతరుల నుండి ఏదీ ఆశించకుండా అందరితో పంచుకునేవారు అత్యంత సుఖవంతులు.

అందరి వద్ద ఆస్తి, ధనము ఉండి తీరుతుందని అనలేము. ఎవరికైనా సలహా, సహకారాల కోసం మీ సమయాన్ని వెచ్చించ వలసి వస్తే, ఇతర పనులలో తీరిక లేక ఉన్నానని అనడం మంచిది

కాదు. మన సమయం, మనకున్న విషయ జ్ఞానం ఇతరులకు ఉపయోగపడితే ఆ విధంగా తప్పక సహాయపడాలి. దానికి ప్రత్యామ్నాయంగా, ఏమీ, అంటే, కనీసం ధన్యవాదాలు కూడా ఆశించరాదు.

మహాభారతంలోని ఒక వృత్తాంతం ప్రకారం, వృత్రాసురుడు అని ఒక రాక్షసుడు ఉండేవాడు. ఆ రాక్షసుడు అందరినీ హింస పెడుతూ ఉండేవాడు. అందుకే ఇంద్రుడు ఆ శత్రువును చంపదలిచాడు. కానీ ఎంత ప్రయత్నించినా ఇంద్రుడు అందులో కృతకృత్యుడు కాలేకపోయాడు. అతను ఈ విషయమై ఇతర దేవతలను సంప్రదించాడు. వాళ్లందరూ కూడా వృత్రుడు చాలా శక్తివంతుడు, ఈ విషయంలో తాము ఏమీ చేయలేమన్నారు. ఏ ఆయుధమూ అతనిని చంపలేదన్న అభిప్రాయానికి వచ్చారు.

వృత్రుడు చాలా క్రూరుడు. ఎంతమందినో చంపుతున్నాడు. అతనిని తప్పక హతమార్చాలని ఇంద్రుడు అన్నాడు. అప్పుడు అక్కడ ఉన్న దేవతలలో ఒకరు, ప్రస్తుతం ఉన్న ఆయుధాలేవీ అతనిని చంపడానికి పనికిరావు, ఒక క్రొత్త ఆయుధాన్ని సృష్టించాలన్నారు. అంతటి శక్తి ఉన్న ఆయుధం ఎక్కడ ఉన్నది? ఎలా తయారు చేయాలన్న చర్చ మొదలైంది. అందులో ఒకరు, “దధీచి అనే ముని ఉన్నాడు. ఆయన ఏళ్ల కొద్దీ తపస్సు చేస్తున్నాడు. తపశ్శక్తి వల్ల ఆ ముని వెన్నెముక అసాధారణమైన బలాన్ని పొందింది. ఆ వెన్నెముకను గనుక సంపాదిస్తే అందులోనుండి తయారు చేయబడిన ఆయుధం ఎంతో శక్తివంతమైనదిగా

ఉంటుంది. దానిని ఉపయోగించి వృత్రాసురుడుని చంపవచ్చు" అన్న సలహా ఇచ్చారు. కానీ, ఆ ముని బ్రతికే ఉన్నాడు. అతని వెన్నెముకను సంపాదించడం ఎలాగ, అని ఇంద్రుడు ఆలోచించాడు. మిగతా దేవతలు దధీచి వద్దకు వెళ్లి ఆయననే అడగమన్నారు.

ఇంద్రుడు దధీచి వద్దకు వెళ్లి, తాను ఒక మంచి కార్యము కొరకు వచ్చానని, వృత్రాసురుడి దురాగతాలను గురించి చెప్పి అతనిని చంపడానికి ఆ ముని వెన్నెముక అవసరమని, కావాలని అర్థించాడు. లోక కల్యాణార్థం వెన్నెముకను ఇవ్వవలసిందిగా ప్రార్థించాడు. అది ఒక అసాధారణ పరిస్థితి. మనిషి మరణించ కుండా వెన్నెముకను సంగ్రహించడం అసాధ్యం. ఇంద్రుని కోరిక విన్న దధీచి ఏమి సందేహించకుండా "నేను స్వయంగా సంకల్పించి నా శరీరాన్ని వదులుతాను. ఇంకొక గంట సమయంలో నా వెన్నెముకను తీసుకోవచ్చు" అన్నాడు. ఇంద్రుడు కోరినది ఎంత అసమంజసం అని ముని అనలేదు. తాను ఏదైనా మంచి కార్యానికి ఉపయోగపడితే అంతకంటే మరేం కావాలని ఆయన అన్నాడు. అలా తయారు చేసిన ఆయుధంతో ఇంద్రుడు వృత్రాసురుడిని వధించాడు. అందుకే ఇంద్రునికి వృత్రుహర అనే పేరు వచ్చింది.

ఇక్కడ వృత్రాసురుడు చంపబడ్డాడు అన్నది ముఖ్యం కాదు. గొప్ప విషయం ఏమంటే ప్రజల క్షేమం కోసం దధీచి ప్రాణత్యాగం చేసి తన వెన్నెముకను ఇచ్చాడు. ఇతరుల శ్రేయస్సే కర్తవ్యమని భావించాడు. వసుధైవ కుటుంబకం అన్నది వాళ్ళ గొప్ప ధ్యేయం.

ఎంత సంపద ఉన్నది?, ఏమేమి తన వద్ద ఉన్నాయన్నది కాదు. **త్యాగేనైకే అమృతత్వ మానసుః** దధీచిని మనం ఇప్పటికీ అతని గొప్ప త్యాగబుద్ధి వల్ల తలచుకుంటూనే ఉంటాము. కోటీశ్వరులు, గొప్ప విద్వాంసులు వేలకొద్దీ ఎందరెందరో ఉండవచ్చు. కానీ వాళ్లను మనం గుర్తుంచుకోము. త్యాగబుద్ధితో అన్నిటినీ ఇతరులకు ఇచ్చే వారిని ఎన్నటికీ స్మరించుకుంటాము. వృత్రాసురుని కథ మనకు త్యాగబుద్ధిలోని గొప్పతనాన్ని తెలుపుతుంది. గాంధీజీ జీవితం కూడా అలాగే త్యాగమయం. ఆయన మరణ సమయానికి సంపద ఒక ఐదు రూపాయలు మాత్రమే. అది కాక మిగిలిన ఆస్తి ఆయన చెప్పులు, కళ్ళజోడు, జేబు గడియారం మాత్రమే. ఆయన కోట్ల ధనం సంపాదించుకొని ఉండవచ్చు. తలచుకుని ఉంటే, ప్రధానమంత్రి అయి ఉండేవాడు. కానీ ఆయనకు అవి ఏవీ అక్కర్లేదు. భారతదేశము స్వతంత్రంగా, సంతోషంగా ఉండడం ఒక్కటే గాంధీజీ కోరుకునేవారు.

త్యాగబుద్ధి కల వ్యక్తి సంతోషంగా ఉంటాడు. అంతే కాదు, ఇతరులలోను సంతోషాన్ని కలిగించగలడు. అలాంటి సుగుణం కలిగిన వ్యక్తి ఇతరులలో కూడా త్యాగభావాన్ని కలుగజేయగలడు. మంచితనం ఇతరులలో మంచితనాన్ని పెంపొందిస్తుంది. వాళ్ళల్లో కూడా ఏమీ ఆశించక ఎదుటివారికి ఏదో ఇవ్వాలన్న భావన రేకెత్తిస్తుంది. వ్యక్తి మంచితనాన్ని, త్యాగబుద్ధిని ప్రత్యేకంగా ప్రకటించుకోనక్కర్లేదు. ఉన్నదానిలోనే కొంత ఎదుటివారికి పంచాలన్న నైజం ఉంటే చాలు. సువాసన ద్రవ్యాన్ని ఒంటికి

రాసుకున్నప్పుడు ఆ విషయం బయటకు చెప్పనక్కర్లేదు. చుట్టుపక్కల ఉన్నవాళ్లు గుర్తిస్తారు.

సూర్యుడు తన విధిగా ప్రకాశిస్తుంటాడు. ఎవరి కృతజ్ఞతలను ఆశించడు. మంచితనం కలిగిన వ్యక్తి కూడా అదే పోకడను ప్రదర్శిస్తాడు. సాధారణంగా మనిషి ధన సంపాదన, ప్రఖ్యాతి, పాండిత్యం మాత్రమే ఆనందాన్ని ఇస్తాయి అనుకుంటాడు. కానీ త్యాగబుద్ధిని అలవర్చుకున్నప్పుడు కలిగే సుఖం వర్ణించరానిది. త్యాగగుణం ఉభయతారకం. ఎదుటివారికి లాభాన్ని, సంతోషాన్ని చేకూర్చడమే కాకుండా వారి నుండి లేదా సమాజంలోని ఇతరుల నుండి కొద్దిగానో గొప్పగానో త్యాగబుద్ధి ప్రదర్శించిన వారికి తిరిగి లభిస్తుంది. ఇది లోకనియతి.

అందుకే మన ఋషులు ఏదో కోరుతూ ఉండడం మంచిది కాదని, ఇతరులకు ఇవ్వడం అలవర్చుకోవాలని చెబుతూ వచ్చారు. అనుభవంలో కూడా మనకు ఒక విషయం తెలియవస్తుంది. ఎంతోకాలం ఏదో కావాలని కోరుకున్నప్పటికీ లభించకపోవచ్చు. కానీ ఎప్పుడో అకస్మాత్తుగా అనుకోని సమయంలో ఆశించినది లభిస్తుంది.

******

# సంభాషణం

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ** Fragrant Petals **లోని 10వ వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

**సరోజా ప్రసాద్**

**భక్తుడు** : బౌద్ధ మతస్థులు జగత్తు ఉనికినే నిరాకరిస్తారు. హిందూ మతంలో తాత్త్వికులు జగత్తు ఉన్నది కాని, అది మిథ్య అంటారు. అవునా?

**భగవాన్** : అది కేవలం దృక్పథాల్లో మాత్రమే.

**భక్తుడు** : ఏదో దివ్యశక్తి ఈ జగత్తును సృష్టించిందంటారు. జగత్తును మిథ్య అనడం మాయ కారణంగానేనా?

**భగవాన్** : అందరూ దివ్య శక్తి సృష్టించిందనే అంగీకరిస్తారు కాని, ఈ శక్తి స్వరూప స్వభావాలు ఏమిటి? అది సృష్టి స్వరూప స్వభావాలకు అనుగుణంగా ఉండాలి కదా!

**భక్తుడు** : మిథ్యలో హెచ్చు తగ్గులు ఉంటాయా?

**భగవాన్** : అసలు మిథ్య అనుకోవడమే ఒక మిథ్య. దానిని బయట నుంచి ఎవరో ఒకరు చూసి కదా మిథ్య అనాలి? అటువంటపుడు, ఆ చూచేవాడు అందులో పాత్ర ఎలా అవుతాడు? మిథ్యలో హెచ్చు తగ్గులు గురించి ఎట్లా మాట్లాడగలడు? సినిమా తెరపై అనేక దృశ్యాలు కదిలిపోతూ ఉంటాయి. భవనాలు దగ్ధమై బూడిదగా మారిపోతుంటాయి. పెద్ద పెద్ద ఓడలు నీటిలో మునిగి పోతుంటాయి; కాని, ఈ దృశ్యాలను ప్రదర్శించే తెరకు మాత్రం ఎటువంటి నిప్పుగాని, నీరు కాని అంటదు. ఎందువల్ల? ఇక్కడ దృశ్యాలు అసత్యం, తెర ఒక్కటే సత్యం కనుక.

ఒక అద్దంలో ప్రతిఫలించే బొమ్మల వల్ల ఆ అద్దం ఏమన్నా మార్పు చెందుతుందా? లేదే! అదే విధంగా, ఈ జగత్తు ఒకే సత్యం మీద ఆధారపడిన దృగ్విషయం. ఏమి జరిగినా ఆ సత్యం చెక్కు చెదరదు. సత్యం ఒకే ఒకటి. ఒక దృష్టి కోణంలో చూడటం వల్లనే మిథ్య అంటుంటారు. దృష్టి కోణాన్ని మార్చుకొని జ్ఞాన దృష్టితో పరికిస్తే, ఈ సమస్త జగత్తు బ్రహ్మ స్వరూపంగా విదితమవుతుంది. ప్రాపంచిక విషయాల్లో తల మునకలైన వారికి ఈ జగత్తు సత్యంగానే అనిపిస్తుంది. దానికి అతీతమైన దృష్టి అలవరచుకుంటే, జగత్తు అదృశ్యమై కేవలం సత్యం ఒక్కటే భాసిస్తుంది.

మోక్ష సాధనకు గురువు అవసరమే అన్న విశ్వాసం సరైనదేనా? అని మహర్షిని ఎవరో అడిగారు. భగవాన్ ఇలా బదులిచ్చారు. "తనను తాను లఘువు (చిన్న) అనుకునే వారికి 'గురువు' (పెద్ద వారి) చేయూత అవసరమే. అయితే, గురువు అంటే ఒక వ్యక్తిగా చూడరాదు. జ్ఞాని ఎవరో కాదు శిష్యుడి అంతరాత్మయే అన్న ఎఱుక అవసరం. ఆ ఎఱుక కలిగినవాడికి గురువు ఉండడు, శిష్యుడు ఉండడు.

ఈ ప్రశ్న ఎందుకు వచ్చిందంటే, మహర్షికి - కనీసం బాహ్యంగా - గురువనే వారెవరూ లేరు కనుక.

ఇంకొక సందర్భంలో భగవాన్ ఇలా అన్నారు - "ఏదైనా క్రొత్త విషయం నేర్చుకోవాలంటే గురువు అవసరమవుతారు. కాని, ఇక్కడ క్రొత్తగా తెలుసుకొనేదేమీ లేదు, తెలిసింది వదులుకోవడమే."

******

# అరుణాచల సాధువుతో గడిపిన మధురమైన దినములు-1

## స్వామి దేశికానంద

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ Surpassing Love and Grace లోని వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

**అనువాదకులు: రవికృష్ణ శర్మ**

ప్రతి మనిషి జీవిత పరమార్థం ఆ మనిషి అంతరాత్మ అయిన భగవంతుడిని సాక్షాత్కరింపజేసుకొనడం. ఆ పరమోన్నతమైన ప్రయోజనాన్ని లేదా లక్ష్యాన్ని సాధించడానికి ముఖ్యమైనవి మరియు అవసరమైనవి మూడు విషయాలు; మనుష్యత్వం - మనిషిగా పుట్టినప్పుడు మాత్రమే మనము మన ప్రారబ్ధాన్ని తీర్చుకోగలము మరియు సాధన చేయగలము, ముముక్షుత్వం - సంసారము నుండి బయట పడాలనే తీవ్రమైన ఇచ్ఛ కలగడం మరియు మహాపురుష సంశ్రయం - మోహ సాగరాన్ని దాటినటువంటి గురువును ఆశ్రయించడం. ఆ పరమోన్నత లక్ష్యము సాధించడమనేది మన ఆధ్యాత్మిక సాధనకు అనుగుణంగా, స్వతహాగా ప్రకటితమవుతుంది. దాని ద్వారా ఉన్నతి కలుగుతుంది.

నా పూర్వపుణ్య కర్మము చేత, అనుగ్రహము చేత నేను భగవాన్ శ్రీ రమణుల సన్నిధికి 1927లో చేరుకున్నాను. నేను ఆశ్రమంలో అడుగు పెట్టినప్పుడు మహర్షి కౌపీనం మాత్రమే ధరించి సోఫాలో కూర్చుని అనంతమైన శూన్యములోనికి దృష్టి సారించి చూస్తూ ఉండటాన్ని గమనించాను. వారి పాదాల వద్ద భక్తులందరూ వారి చుట్టూ కూర్చుని ఉన్నారు. ఆ దృశ్యము ఋషుల కాలాన్ని

తలపింపజేస్తున్నదా అన్నట్లు ఉన్నది. వారి సన్నిధిలో కొంతసేపు నిలుచుని ఉన్నాను. ఆ సమయంలో వారు నన్ను సర్వ సామాన్యంగా చూసినట్లు చూశారు. దానితో నేను వారికి నా ప్రణామములు అర్పించుకున్నాను. వారు నన్ను కరుణతో ఎక్కడి నుండి వస్తున్నాను, ఎక్కడ బస చేశాను అనే విషయాలని అడిగి తెలుసుకున్నారు. మరుసటి రోజు ఉదయము ఆశ్రమానికి వెళ్లి మహర్షి ఎదురుగా ధ్యానంలో కూర్చున్నాను. మనస్సు ఎంతో ప్రశాంతంగాను, చంచలత్వం లేకుండా ఉన్నది, మహర్షి యథావిధిగా సోఫాలో కూర్చుని గిరివైపు దృష్టి నిలిపి ఉంచినట్లుగా కనిపించారు.

మరుసటి ఉదయం మరల నేను ఆశ్రమానికి వెళ్లి వారి పాదాల వద్ద కూర్చున్నప్పుడు, వారి సన్నిధిలో నాకు చాలా తేలికగా ఏకాగ్రత కుదురుతున్నట్లు తెలుస్తున్నది. అలానే ఎక్కువ సమయం ఎటువంటి అంతరాయం లేకుండా ధ్యానం చేసుకోగలగడం జరుగుతున్నది. ఇంతకుమునుపు ఇంకెక్కడా ఇలా జరుగలేదు. ఎప్పుడైతే నేను పొందుతున్న ఆనందాన్ని మహర్షికి తెలియజేశానో, అప్పుడు వారు నన్ను, ధ్యానం చేసే సమయంలో నిద్రపోతున్నారా అని అడిగారు. నేను లేదు అని చెప్పినప్పుడు వారు నవ్వి, నేను ధ్యానం చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. హృదయంలో ఉన్న జ్యోతి మీద దృష్టి నిలిపి ఎప్పుడెప్పుడయితే నా మనస్సు చలిస్తుందో అప్పుడప్పుడు నా ఇష్టదైవానికి పుష్పాన్ని సమర్పిస్తాను. ఇలా చేయమని రామకృష్ణ మఠానికి చెందిన రెండవ అధ్యక్షులైన

స్వామి శివానందజీ మహారాజ్ తెలియజేశారు అని మహర్షితో చెప్పాను. దానికి మహర్షి ఆ విధంగా చేయడం మంచిదేనని నాకు చెప్పి, దానినే కొనసాగించమని తెలియజేశారు.

మూడవ రోజు మహర్షి ఎదురుగా కూర్చుని చాలాసేపు ధ్యానం చేసిన తరువాత, నేను జీసస్ చిత్రపటాన్ని ఒక చర్చిలో చూశానని, అందులో జీసస్ చుట్టూ విభిన్న జాతులకు చెందిన జంతువులు, ఒకదానితో ఇంకొకటి శాంతి సామరస్యాలతో ఎలా ఉన్నాయో తెలియజేశాను. దానికి వారు, అలా జరగడానికి కారణం సాధువైన వాడు శతృత్వాన్ని స్వాధీనంలో ఉంచుకుంటాడు కనుక అలా జరుగుతుంది అని అన్నారు. ఈ ఆశ్రమంలో పాములు కూడా ఎవ్వరినీ ఏమీ చేయవు అని చెప్పి ఒక సాధువు సన్నిధిలో క్రూర స్వభావాలు స్వాధీనంలో ఉండడం వలన సౌభ్రాతృత్వము విలసిల్లు తుందని చెప్పారు. ఆ విధంగా సనాతన ఋషులు, ఏ క్రూర మృగాల చేత బాధింపబడక అరణ్యాలలోను, గుహలలోను జీవించారు అని అన్నారు.

ఆ రోజు సాయంత్రం ఒక సందర్శకుడు మహర్షిని 'ధ్యాన సమయంలో మీకేమైనా భగవత్ దర్శనాలు జరుగుతాయా?' అని అడిగాడు. దానికి భగవాన్ నవ్వుతూ ఆత్మగా ఉండడం మన సహజ స్థితి, దానికి ఎటువంటి రూపము లేదు అని చెప్పి శంకరాచార్యుల వారి శ్లోకాన్ని ఉదహరించారు: ''నీవు శరీరానివి కావు, మనస్సువు కావు, బుద్ధివి కావు, వీటన్నింటినీ దాటిన వాడివి, నీవు ఆత్మవు.'' ఎవరైతే అన్ని కోరికలను త్యజించి మనస్సును ఆత్మలో లీనం

చేస్తారో, అటువంటి వారి మనస్సు తనంతట తానుగా నశిస్తుంది. అప్పుడు వాళ్ళు ధ్యానంలో సంపూర్ణత్వాన్ని సాధిస్తారు. అటువంటి వారి మనస్సు మనస్సు కాదు. మనస్సు ఆత్మలో లీనమైపోవడాన్నే సమాధి అని అంటారు. ఇది మానవుని సహజ స్థితి మరియు పరమోత్కృష్టమైన ఆనందము అని వివరించారు.

మానవుని అత్యుత్తమమైన లక్ష్యము ఏమిటి అంటే 'నేనెవరిని?' అనేది తెలుసుకొని ఆత్మ సాక్షాత్కారం పొందటమే. ఒక మనిషి దానిని తెలుసుకోవాలి అనే ప్రయత్నము కనుక చేయక పోతే ఆ మనిషి జీవితం వ్యర్థమే. అత్యుత్తమమైన ఆత్మానంద స్థితిలో అనుభవించే శాంతి మరియు ఆనందము ఎంతో ప్రియ మైనది. అది ఈ ప్రపంచములో అనుభవించే వేటికీ సరితూగదు. ఇది అన్ని జీవుల హృద్ గుహలో సంస్థితమై ఉన్నది. అలా సంస్థితమై ఉన్న దానిని గనుక గుర్తించకపోతే జనన మరణ చక్రంలో పడి తిరుగుతూనే ఉంటాము. తన నిజ స్థితిలో ఉన్నవాడు బాధ, దుఃఖానికి ఆవల ఉంటాడు. అది మనిషిని మరణం లేని వానిగా చేస్తుంది.

నేను చిన్నవాడిగా ఉండటం వలన, ఈ విధమైన ఉపదేశాన్ని అనుసరించడం కష్టంగా తోచి, తిరిగి ఆశ్రమానికి మరుసటి దినము వచ్చినప్పుడు, ఆ ఉపదేశాన్ని గురించి విశదీకరించి చెప్పవలసి నదిగా మహర్షిని కోరాను. అప్పుడు మొదటిసారి మహర్షిని 'భగవాన్' అని సంబోధించడం జరిగినది. అప్పుడు భగవాన్, అవును ఈ మార్గాన్ని అనుసరించడం నిజానికి కష్టమే, పదునైన కత్తి మీద

నడవడం ఎంత కష్టమో అంత కష్టము అని చెప్పి, హృదయ పూర్వకంగా సాధన చేస్తే అది ఫలితాన్ని ఇస్తుంది అని తెలియ జేశారు. "నీవు (అంటే నన్ను) రెండు లేదా మూడు గంటలు ఇప్పుడు ధ్యానం చేయగలుగుతున్నావు అని అంటే అది ఈ జన్మలో చేస్తున్న సాధన వల్ల కాదు, పూర్వ జన్మలలో నీవు చేసిన సాధన ఫలితము" అని అన్నారు శ్రీ భగవాన్.

ఐదవ రోజున నేను దర్శనానికి వెళ్ళినప్పుడు యుక్త వయస్కు రాలైన ఒక స్త్రీ తన చంటి బిడ్డను ఒళ్లో పెట్టుకుని విపరీతంగా శోకిస్తున్నది. కొంతకాలం క్రితమే తన భర్తను కోల్పోవటం చేత తీవ్రమైన దుఃఖంలో ఉన్నది. భగవాన్ ఆమె వైపు తిరిగి కరుణా పూరిత దృక్కులతో చూస్తూ "భర్త, భార్య మరియు పిల్లలు అనేది దేహానికి సంబంధించినది. ఇంటికి వెళ్ళు, నీవెవరివో తెలుసుకో. ఏడవ వద్దు, ఇంటికి వెళ్ళు" అని చెప్పారు. జ్ఞాని పలికే పలుకులకు పరివర్తన కలిగించే శక్తి ఉంటుంది. 'ఇల్లు' అనే పదానికి ఆధ్యాత్మిక సౌధము, ఉత్పత్తి స్థానము అని కూడా అర్థము ఉన్నది. "ఇంటికి వెళ్లి నీవెవరివో తెలుసుకో" అన్న భగవాన్ ఆదేశం ఆవిడ హృదయంలో ఏకాగ్రతను కలిగించడంతో పాటు శోక సాగరం నుండి పవిత్రురాలిని చేసి ఉండవచ్చు. ఇంకొక యుక్త వయస్కు రాలైన స్త్రీ ఎచ్చమ్మాళ్. ఆమె జీవితము కూడా హృదయవిదారక మైనది. తను కూడా తన కుటుంబ సభ్యులను అందరినీ పూర్తిగా కోల్పోయినది. అటువంటి సమయంలో భగవాన్ మౌనము ఒక్కటే ఆమెలో పరివర్తనను తెచ్చి, దుఃఖ సాగరము నుండి కోలుకునేలా

చేసింది. ('రమణ మహర్షి అండ్ ద పాత్ ఆఫ్ సెల్ఫ్ నాలెడ్జ్' అన్న పుస్తకము నుండి సంగ్రహించినది).

మిగిలిన రోజులు యథావిధిగా కొనసాగాయి. భగవాన్ దినచర్య ఏమిటంటే, మధ్యాహ్నం వరకు సోఫాలో కూర్చుని ఎక్కువ సమయము మౌనములో ఉండేవారు. భోజనానంతరము కాసేపు విశ్రాంతి. ప్రతి దినము ఉదయము మరియు సాయంత్రము రెండు సార్లు, వచ్చిన ఉత్తరాలను చూసి అటు తరువాత కొండ మీదకు కొంతదూరం నడకకు వెళ్ళేవారు. ఒకానొక సందర్భంలో భగవాన్ 'మనస్సనేదే లేనప్పుడు, ఇతరము అనేది ఉండనే ఉండదు' అని అన్నారు. ఒకే ఒక్క ప్రశాంతత మరియు ఆనందము అంతటా విస్తరించి ఉన్నది అని చెప్పి వెంటనే ఆ మాటను కూడా సరి చేసుకుంటూ, ఒకే ఒక్కటి విస్తరించి ఉన్నదని కూడా చెప్పలేము, ఎందుకంటే రెండవది అనేది లేదు కనుక అని చెప్పి ఆ సత్ చిత్ ఆనంద స్థితిలో లీనమైపోయారు. ఎల్లవేళలా అదే వారి సహజ స్థితి. ఆ స్థితిలోనే ఉండేవారు.

తొమ్మిదవ రోజు, ఎప్పుడైతే ఇక నేను ఆశ్రమాన్ని వీడి వెళ్ళ వలసిన సమయం వచ్చిందో, అప్పుడు భగవాన్ ముందు మోకరిల్లి విపరీతంగా ఏడ్చేశాను. అది చూసి భగవాన్ "మీరు ఇక్కడే ఉండవచ్చు, ఎవ్వరూ మిమ్మల్ని వెళ్ళమని చెప్పలేదు" అని అన్నారు. అయినా కాని, మరుసటి దినము నేను భగవాన్ వద్ద సెలవు తీసుకునేటప్పుడు, 'ఇక ముందు కూడా యథావిధిగా ధ్యానాన్ని

కొనసాగించమని, కాలములో అన్నీ సర్దుకుంటాయి' అని భగవాన్ నాతో చెప్పారు.

భగవాన్ అనుగ్రహంతో, నేను ఆకర్షింపబడిన ఆ సాధువు (భగవాన్), అత్యుత్తమైన ఆత్మ సాక్షాత్కార స్థితిని అనుభూతి చెందడమే కాక, ఇతరులకు కూడా ఆ ప్రశాంతతను మరియు ఆనందానుభూతిని కొన్ని కొన్ని సమయాలలోనైనా అనుభూతి చెందేలా సహాయాన్ని అందిస్తున్నారు. అదే ఇతః పూర్వము, ఇప్పుడు మరియు ఇక ముందు కూడా నా జీవితమనే నౌకకు చుక్కాని. మౌనముతోనే అందరికీ తోడ్పాటునందించే శ్రీ భగవాన్ నిజంగా శాశ్వతమైన ఆధ్యాత్మిక ఆనందానికి, ప్రశాంతతకు ఒక నిత్య నూతన వసంతము వంటివారు.

అయితే ముగించేముందు నేను ఈ విషయాన్ని ప్రస్తావించడం సబబుగా ఉంటుందని భావిస్తూ భగవాన్ రమణులకు దండ ప్రణామములు అర్పిస్తూ, 'కాలము గడుస్తున్న కొద్దీ అంతకంతకూ పెరుగుతూ వస్తూ ఉన్న అనేకమంది సాధకులను ప్రోత్సహిస్తూ ఉంటారు' భగవాన్ అని ఆశిస్తూ

**ఓ దక్షిణామూర్తి! నీది ఎంత అనుగ్రహమయ్యా**
**జీవకోటిని అనుగ్రహించడానికి మానవ రూపాన్ని ధరించి**
**సత్యం శివం సుందరం అను వానికి ప్రతిరూపమై ఉన్నటువంటి భగవాన్‌కు**
**నేను పునః పునః ప్రణమిల్లుతున్నాను.**

******

## అధ్యాయము - 4

# భగవాన్ భక్తులు - గోవులు

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ** Bhagavan Ramana The Friend of all **లోని 4వ అధ్యాయానికి స్వేచ్ఛానువాదం**

(గత సంచిక తరువాయి) వి. రమేష్ బాబు

ఆవుల పేడతో బయోగ్యాస్ ఉత్పత్తి చేస్తున్నారు. ఆ పేడ ఆశ్రమం మొక్కలకు ఎరువుగా ఉపకరిస్తుంది. ఇదంతా గోమాత లక్ష్మి వారసుల సౌభాగ్యమే.

**భగవాన్ భక్తుల నుండి సేకరించిన గోలక్ష్మి జ్ఞాపకాలు**

గుడియాత్తం అనే గ్రామం దగ్గర కుమార మంగళం అనే ఒక చిన్న గ్రామములో అరుణాచల పిళ్ళై అనే భగవాన్ భక్తుడు ఉండేవాడు. అతనికి కలలో భగవాన్‌కు, ఆవు, దూడ బహూకరించాలని ఆదేశం వచ్చింది. అతడు దానిని దైవాజ్ఞగా భావించాడు. అనుకున్నట్లుగానే ఆవు, ఒక లేగ దూడకు జన్మనిచ్చింది.

1926వ సంవత్సరము ఒక శుక్రవారము రోజున లేగదూడకు ఆరునెలలు వచ్చిన తరువాత అరుణాచల పిళ్ళై ఆవు, దూడలను తీసుకొని ఆశ్రమానికి వచ్చాడు. భక్తితో భగవాన్‌కు ప్రేమ పూర్వకంగా సమర్పించి కానుకగా స్వీకరించమని కోరాడు. భగవాన్ ఎంతో సున్నితంగా ఆశ్రమంలో ఆవులకు సరైన వసతి లేదని, ఆవులకు కావలసిన వనరులు కూడా లేవని కావున ఆవు, దూడ వద్దని చెప్పారు. అంతకు మించి ఆశ్రమం చుట్టూ ఉన్న అడవి చాలా దట్టంగా ఉండటం వలన అందులో పెద్దపులులు, చిరుత పులులు

తిరుగుతూ ఉంటాయి. సంరక్షణ దృష్ట్యా ఆశ్రమంలో ఆవు, దూడ ఉండటానికి ఆశ్రమవాసులు విముఖత చూపారు. అరుణాచల పిళ్ళై ఆవు దూడలను వెనక్కు తీసుకు వెళ్ళడానికి ససేమిరా అంగీకరించలేదు.

నీవు నీ విధి నిర్వర్తించావు. ఆశ్రమానికి ఆవు, దూడలను బహూకరించావు. వాటిని ఎవరు సంరక్షించాలి? నీవు మా బదులు నీవద్దనే ఉంచుకొని సంరక్షించు అన్నారు భగవాన్.

అయ్యా దైవాజ్ఞ వలన నేను ఈ కానుక మీకు సమర్పించు కున్నాను. మీరు నాగొంతు కోసినా సరే, వీటిని నేను వెనుకకు తీసుకుని వెళ్ళను అని అరుణాచల పిళ్ళై దృఢంగా చెప్పాడు.

అరుణాచల పిళ్ళై మాటల వెనుక ఉన్న భక్త్యావేశం చూచిన భగవాన్ భక్తులు రామనాథ దీక్షితులు ఈ ఆవు దూడలను నేను సంరక్షిస్తాను అని ఉత్సాహంగా ప్రకటించారు.

(రామనాథ దీక్షితులు 40 సంవత్సరాలు భగవాన్ సహచర్యంలో ఉన్నారు. భగవాన్ కంటే కొన్ని సంవత్సరాల ముందుగానే కాలధర్మం చెందారు).

అప్పుడు రామనాథ దీక్షితులవారు శ్రీ రమణాశ్రమంలోనే ఉంటున్నారు. రామనాథ దీక్షితులు పొట్టిగా, పీలగా అంత ప్రాధాన్యం లేని మనిషిలా కనిపించే ఆయన నుండి ఎవ్వరూ అంతటి తీవ్రమైన నిర్ణయాన్ని ఊహించలేదు. ఈ సందర్భంలో ఆయన స్ఫూర్తి పొందాడు. తన ఛాతీ మీద తట్టుకుంటూ పెద్ద గొంతుతో నేను ఉన్నాను. నాకు నేనుగా ఈ ఆవు దూడల సంరక్షణ బాధ్యతను స్వీకరిస్తున్నాను అన్నారు.

ఈ విధంగా అరుణాచల పిళ్ళై భక్త్యావేశంతో ఇచ్చిన దాన్ని వెనుకకు తీసుకోను అని దృఢంగా అనడం, రామనాథ దీక్షితులు తీవ్రంగా సంరక్షణ బాధ్యత వహించడంతో ఆవు, దూడలు ఆశ్రమ వాసులుగా చేరాయి. రామనాథ దీక్షితులు మూడు నెలలపాటు గొప్ప దయతో, ప్రేమ నిండిన సంరక్షణతో ఆవు, దూడలను పెంచాడు.

దూడ ఎంతో ఆనందంగా ఆడుకునేది. భగవాన్ మీద దానికి అసాధారణమైన ప్రేమ, భక్తి. కొంత కాలం తరువాత రామనాథ దీక్షితులు ఆవు, దూడల ఆలనా పాలనా చూడలేకపోయాడు. అరుణాచలం పట్టణంలో నివసించే పశుపతి అయ్యరుకు వీటిని అప్పగించారు. ఆయన కర్ణాటక దేశం నుండి వచ్చిన కన్నడిగులు.

ఆయన పశు సంరక్షణ చేస్తూ ఒక పాలకేంద్ర వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఆయన ఆవును, దూడను శ్రద్ధగా సంరక్షిస్తున్నారు. ఇలా ఒక సంవత్సరం గడిచిపోయింది.

ఒక గ్రహణం రోజు పశుపతి అయ్యర్ ఆవుదూడలను నీళ్ళతో కడగడానికి ఆశ్రమం దగ్గరలో ఉన్న పాలీతీర్థం వద్దకు వచ్చారు. వాటి జలకాలాట పూర్తయిన తరువాత పశుపతి అయ్యర్ వాటిని ఆశ్రమానికి భగవాన్ దర్శనం కోసం తీసుకువచ్చారు.

దూడ భగవానుని చూడగానే ఆనందం పొంగిపొరలి గంతులు వేయడం మొదలుపెట్టింది. వారి చుట్టూ ప్రదక్షిణ చేసింది. వారి పాదాల మీద తన నుదురు ఉంచింది. ఆశ్రమం చుట్టూ తిరిగింది. ఆ తరువాత కొంతసేపటికి పశుపతి అయ్యర్ ఆవు దూడలను తన వెంట పట్టణంలోని తన ఇంటికి తోలుకుపోయాడు. ఆ దూడ

ఆశ్రమం చుట్టూ తిరిగి దాని రూపరేఖల్ని పట్టణంలో ఇంటినుండి ఆశ్రమానికి వచ్చే త్రోవని బాగా గుర్తుపెట్టుకుంది. మరుసటి రోజు ఉదయం అది ఒంటరిగా ఇంటి నుండి బయలు దేరి ఆశ్రమానికి వచ్చింది. భగవాన్ ముందు నిలుచుంది.

అది ఆమెకు భగవాన్ పట్ల గల ఆకర్షణ. నాటినుండి ఆ దూడ ఉదయాన్నే ఒంటరిగా పట్టణం నుండి ఆశ్రమానికి వచ్చేది. పగలంతా ఆశ్రమంలో గడిపి సాయంత్రానికి తిన్నగా పట్టణంలోని పశుపతి అయ్యర్ ఇంటికి వెళ్ళేది. ఆశ్రమంలో ఉన్నంతసేపు దాని దృష్టి భగవాన్ మీదే ఉండేది. సాయంత్రం వారి సన్నిధి వదిలి వెళ్ళడానికి ఎంతో కష్టంగా, బాధగా ఉండేది. భగవాన్ ఆ దూడ పట్ల ఎంతో శ్రద్ధ, ప్రేమ చూపేవారు. ఆ దూడ భగవాన్ మంచం ప్రక్కన పడుకుని ఉండేది. దానికి ఆహారం లభించినా అది భగవానే స్వయంగా దానికి అందించాలని ఒత్తిడి చేసేది. ఆమెకు కొండ అరటిపళ్ళు అంటే చాలా ఇష్టం.

ప్రతి సాయంత్రం హాలు చుట్టూ ప్రదక్షణం చేసి ఇష్టం లేనట్లుగా భావాలు వ్యక్తం చేసి టౌనులోని తన ఇంటికి వెళ్ళేది. ఈ విధంగా ఒక సంవత్సరం నిరంతరం ఆనందకరమైన సత్సంగం భగవానుతో గడిచింది. ఆశ్రమానికి శుక్రవారం రావడం వలన ఆమెను ప్రేమగా అందరూ లక్ష్మి అని పిలిచేవారు.

1930 నాటికి లక్ష్మి రెండు కోడెదూడలకు జన్మనిచ్చింది. కోడెదూడలు కలిగితే ఆశ్రమానికి, లేగదూడ కలిగితే అవి పశుపతి అయ్యరుకు చెందాలని ఒప్పందం చేసుకున్నారు. మూడవసారి లక్ష్మి గర్భం ధరించింది. ఒక రోజు ఆశ్రమానికి వచ్చిన లక్ష్మి తిరిగి సాయంత్రం ఇంటికి వెళ్ళడానికి తిరస్కరించింది.

భగవాన్ కూర్చునే సోఫా వద్ద కూర్చుని కన్నుల వెంట కన్నీరు కారుస్తూ దుఃఖించింది. దేనికీ చలించని భగవాన్ లక్ష్మి కన్నీటిని చూసి కదిలిపోయారు. లక్ష్మి ఏమంటావు? ఇంటికి వెళ్ళనంటావా? నీవు ఇక్కడే ఉండాలని అనుకుంటున్నావా? ఇప్పుడు నేను ఏమి చేయగలను? ఇతరులను చూస్తూ, చూడండి లక్ష్మి దుఃఖిస్తున్నది. ఇక్కడ నుండి ఆమె వెళ్ళను అంటున్నది. ఆమె ఇప్పుడు నిండు చూలాలు. ఏ క్షణంలో నయినా ప్రసవించవచ్చు. ఆమె టౌనులో ఇంటికి ఎంతో దూరం నడిచి వెళ్ళాలి. మళ్ళీ ప్రొద్దున్నే ఇక్కడికి రావాలి. ఆమె ఇక్కడికి రావాలనే కోరికను ఆపుకోలేదు. ఆమె ఇప్పుడు ఏం చేస్తుంది....

భగవాన్ లక్ష్మికి ఎంతగానో నచ్చజెప్పి ఒప్పించి ఇంటికి పంపించారు. ఆ రాత్రే ఆమె ఒక దూడకు జన్మనిచ్చింది. అప్పుడే పశుపతి అయ్యరుకు కుటుంబ సంబంధిత ఇబ్బంది వచ్చింది. లక్ష్మి చాపల్య చేష్టలను తట్టుకోలేక ఆవు, దూడలను తెచ్చి భగవాన్‌కు బహూకరించాడు. లక్ష్మి భగవాన్ పాదాల చెంత కూర్చొని లేవలేదు. భగవాన్ తన కుడి చేయి ఆమె తల మీద ఉంచి నిమురుతూ లక్ష్మి నువ్వు ఆశ్రమంలో పూర్తిగా ఉండిపోవాలని కోరు కుంటున్నావా? కన్నులు మూసుకుని ధ్యాన పరవశంలో ఉన్నట్లుగా ఉన్నది. అది గుర్తించిన భగవాన్ ఇతరులతో లక్ష్మి భగవాన్ అధీనంలో తన బిడ్డను ఉంచిన తరువాత తన బాధ్యత తీరిపోయినట్లు భావిస్తున్నట్లుగా అనిపిస్తుంది అన్నారు.

1930 నుండి లక్ష్మి, ఆమె సంతానం శాశ్వతంగా ఆశ్రమంలో నివసించడానికి వచ్చేశారు. లక్ష్మి ఆశ్రమం వారికి ఇష్టమైన ప్రముఖ సభ్యురాలిగా మారిపోయింది.

శాంతాలాల్ ఆశ్రమ వంటగదిలో వంట పని చేసే భక్తుడు. ఆయన జ్ఞాపకాల నుండి చెప్పిన లక్ష్మికి చెందిన సంఘటన : లక్ష్మి మూడవసారి గర్భం దాల్చింది. భోజనం తరువాత ఆమె హాలులోకి వచ్చింది. హాలులో ఆ సమయంలో నేను కూడా అక్కడే ఉన్నాను. భగవాన్ వార్తా పత్రిక చదువుతున్నారు. లక్ష్మి భగవాన్ వద్దకు వెళ్ళి పేపరును నాకడం మొదలుపెట్టింది.

భగవాన్ లక్ష్మి వంక చూచి లక్ష్మీ కొంచెం ఆగు అన్నారు. అయినా ఆమె పేపరు నాకడం ఆపలేదు. భగవాన్ పేపరు ప్రక్కన పెట్టారు. భగవాన్ తన చేతిని లక్ష్మి కొమ్ముల మీద ఉంచి తన తలను ఆమె తల మీద ఉంచారు. ఈ విధంగా ఇరువురూ చాలా సేపు పూర్తిగా అలానే ఉన్నారు. నేను ప్రక్కనే ఆ అద్భుత దృశ్యాన్ని చూపుతోనే తాగుతున్నట్లుగా ఆశ్చర్యంగా చూస్తూ నిలబడి ఉన్నాను.

పది నిముషాల తరువాత భగవాన్ ఏ మాత్రం కదలిక లేకుండా నాతో, నీకు తెలుసా ఇప్పుడు లక్ష్మి ఏమి చేస్తుందో? ఆమె ఇప్పుడు సమాధి స్థితిలో ఉన్నది అన్నారు. నేను లక్ష్మి వంక చూశాను. ఆమె విశాలమైన బుగ్గల మీద కంటి చివరల నుండి కన్నీటి బిందువులు జాలువారుతున్నాయి. ఆ కన్నులు మాత్రం భగవాన్ నే చూస్తున్నాయి. కొంత సమయం గడిచిన తరువాత భగవాన్ తన స్థితి (భంగిమ) మార్చి సున్నితంగా లక్ష్మి ఇప్పుడు ఎలా ఉన్నది? అని అడిగారు.

లక్ష్మి అడుగులో అడుగు వెనకకు వేసుకుంటూ నడిచింది. తన తోకను భగవాన్‌కు చూపించడం ఇష్టం లేనట్లున్నది. ఆ తరువాత హాలు చుట్టూ ప్రదక్షిణ చేసి వెళ్ళిపోయింది.

నేను ఒక గురువు, తన భక్తునితో మమేకం చెందిన ఆ అపూర్వ దృశ్యాన్ని వీక్షించి ప్రోత్సాహం పొందడం భగవాన్ ఆశీస్సులుగా భావించాను. లక్ష్మికి మానవ మేధకు ఉన్నంత తెలివి ఉన్నట్లు నిరూపితమైన సంఘటనలు అసంఖ్యాకంగా ఉన్నాయని అంటారు. లక్ష్మి మానవ భాష మాట్లాడలేదు కానీ ఆమెకు అన్ని విషయాలు అర్థమవుతాయి. భగవాన్ హాలులో ఉన్నప్పుడు ఆమె సరిగ్గా భోజన సమయానికి వచ్చి భగవాన్ ముందు నిలబడుతుంది. వారు లేచి వచ్చిన తరువాత భోజనశాల వరకు వారిని అనుసరిస్తుంది.

ఆ రోజులలో భోజన సమయానికి గంట కొట్టే అలవాటు. గోలక్ష్మి ఖచ్చితంగా సమయపాలన పాటించేది. భగవాన్ ఇతర పనులలో నిమగ్నమై సమయం గురించి మరచిపోయినా వచ్చి ముందు నిలబడగానే, భగవాన్ గడియారం వంక చూసేవారు, సరిగ్గా అది భోజన సమయమే!

ఆమె ఎప్పుడూ భగవాన్ వద్దకు తిన్నగా వెళ్ళి భోజనానికి సమయమైంది అని గుర్తు చేస్తుండేది. ఆమెకు గల భక్తి ఆమెకు ప్రత్యేక హక్కును కలిగించింది. భగవాన్ సన్నిధికి సరాసరి వెళ్ళి నిలబడేది. హాలులో ఆశ్రమ వాసులుగాని సందర్శకులుగాని ఎవరు ఉన్నా ఆమెకు పట్టింపు లేదు.

లక్ష్మికి ఆశ్రమంలో ప్రత్యేక హోదా ఉండేది. భక్తులు తెచ్చిన ఏ ఆహారమైనా ఆమె స్వీకరించుటకు స్వేచ్ఛ ఉండేది. ఏ భక్తులైనా తాము తెచ్చిన ఆహారం లక్ష్మి స్వీకరించిందని ఫిర్యాదు చేసినా భగవాన్ ఎల్లప్పుడు లక్ష్మి పక్షమే మాట్లాడేవారు. ఎవరైనా లక్ష్మి హాలులోకి రాకుండా నిరోధిస్తే భగవాన్ వారిని కాదని లక్ష్మి వైపు మాట్లాడేవారు.

**భగవాన్ భక్తులు ఎన్.ఎన్. రాజన్ వర్ణించిన లక్ష్మి**

ఒకసారి నేను భగవాన్ కొరకు ఆహార పదార్థాలను ఒక పెద్ద పాత్రలో తెస్తున్నాను. నా వెనుక వస్తున్న గోలక్ష్మి పాత్రలో మూత లేని ఆహారాన్ని తినడం మొదలు పెట్టింది. నేను గమనించలేదు. భగవాన్ గమనించి చాలు లక్ష్మి చాలు మాకు కూడా కొంత మిగుల్చు అని చెప్పి కొంత ఆహారాన్ని లక్ష్మికి తన చేత్తో పెట్టి పంపించారు.

అజాగ్రత్తగా ఉన్నందుకు మరో పరిచారకుడు నన్ను ఎగతాళి చేస్తూ మందలించాడు. భగవాన్ ఎంతో దయతో మంచివాడు అతనిని ఎందుకు మందలిస్తావు? పాపం ఇవన్నీ పసిగట్టే అంత తెలివి లేదు. ఒకసారి మంచివాడు అన్ని యోగ్యతాపత్రం గురువు నుండి లభించిన తరువాత జీవితంలో ఇంకా కావలసింది ఏమున్నది?

ఆశ్రమం వారు లక్ష్మి కోసం కావలసిన పశు గ్రాసమంతా సేకరించి ఉంచారు. అది ఆమెకు తెలుసు. అయినా ఆమె దానితో సంతృప్తి పొందడం లేదు. ఆమెకు టిఫిను సమయము, భోజన సమయము తెలుసు. ఆ రెండు సమయాలలో హాలులోకి తిన్నగా ప్రవేశించి తన తలను భగవాన్ భుజాల వద్ద ఉంచుతుంది. భగవాన్ ప్రేమగా నిమిరి వంటగదిలోని పరిచారకులను పిలిచి ఆమెకు ఆహారం ఇవ్వమంటారు.

ఆశ్రమంలో ఆ రోజులలో నీటికి కొంచెం ఇబ్బంది ఉండేది. అన్ని ఇబ్బందులతో సైతం ఆశ్రమంలో చిన్న తోట పెంచుతున్నారు. లక్ష్మి వయసులో ఉన్నది. పైగా చలాకీతనం ఎక్కువ. చిన్న తోటలో

చొఱబడి తరచు పళ్ళు, లేత కాయగూరల మొక్కల్ని తిని తోటకు భారీ నష్టం కలిగించేది. తోటపని పర్యవేక్షకులు భగవాన్ వద్దకు వచ్చి లక్ష్మి చేసిన పనిపై ఫిర్యాదు చేసేవారు. అయినప్పటికీ భగవాన్ ఎప్పుడూ లక్ష్మినే సమర్థించేవారు. ఆమెను మీరు తప్పు బట్టకూడదు. ఆమె ఎక్కడ మంచి ఆహారం కనబడుతుందో అక్కడికి వెళుతుంది. ఆమె అక్కడకు వెళ్ళగూడదనేటప్పుడు, మీరు తప్పనిసరిగా తోట చుట్టూ కంచెవేసి లక్ష్మికి అందుబాటులోకి రాకుండా చేయాలి. భగవాన్ మాట్లాడుతుంటే ఏమి తెలియక తప్పు చేసిన చిన్నపిల్ల అమాయకంగా బుంగమూతి పెట్టి చూసినట్లు గోలక్ష్మి చూసేది.

లక్ష్మి గోశాల నుండి తనంత తానుగా ప్రతీ ఉదయం వచ్చి హాలులో ఉన్న భగవాన్ పాదాల ముందు మోకరిల్లేది. ఆ తరువాత గోశాలకు వెళ్ళి పాలిచ్చేది. ఒక పౌర్ణమి రోజు పశువుల కాపరి మామూలు సమయం కన్నా ముందుగానే వచ్చాడు. గోశాలలో లక్ష్మి లేదు. హాలులో భగవాన్ ముందు సాష్టాంగం చేయడానికి వెళ్ళింది. భగవాన్ హాలులో తాను ఉండే చోటులేదు. వెదికితే భగవాన్ వంటశాలలో కాయగూరలు కోస్తూ ఉన్నారు. గోలక్ష్మి వెళ్ళి భగవాన్ను బయటకు రమ్మని పిలిచింది. ఆయన బయటకు రాగానే గోలక్ష్మి భగవాన్ పాదాల మీద తలవుంచి ప్రణమిల్లింది. ఆ సమయంలోనే పశువుల కాపరి గోలక్ష్మిని వెదుకుతూ వంటశాల వద్దకు వచ్చాడు.

గోలక్ష్మి పాదాభివందనం సంఘటన చూసిన పశువుల కాపరి, భక్తిపూర్వక భయవిస్మయాలతో మూగబోయాడు. భగవాన్‌కు పాదాభివందనం చేసిన గోలక్ష్మి ఇప్పుడు పశువుల కాపరితో

వెళ్ళడానికి సిద్ధపడింది. పశువుల కాపరి గోలక్ష్మి భక్తి పారవశ్యాన్ని గురుభక్తుల తాదాత్మ్యాన్ని చూచి ఎంతో అభినందించాడు. భగవాన్ కు లక్ష్మి పాదాభివందనం చేస్తున్న ఫోటో ఇప్పటికీ ఆశ్రమంలో ఉన్నది. భగవాన్ భక్తులలో బాగా వ్యాప్తి చెంది కీర్తి పొందిన ఫోటో ఇది.

ఒక వేసవిలో నీటి ఎద్దడికి ఆశ్రమంలో పశుగ్రాసం కొరత ఏర్పడింది. లక్ష్మికి ఆహారం పూర్తిగా లభించక ఆమె బరువు కోల్పోయి బక్కచిక్కింది. భగవాన్ దీనిని గమనించారు. గోలక్ష్మికి ఆహారం తినగలిగినంత లభించడం లేదని అర్థమయింది. మరుసటి రోజు భోజనశాలలో ఆహారం తీసుకోవడానికి తిరస్కరించి ఆ ఆహారాన్ని గోలక్ష్మికి పెట్టండి అన్నారు భగవాన్. భగవాన్ ప్రవర్తించిన తీరు వార్త అందరికీ చేరింది. ఆశ్రమం వారందరికీ గోలక్ష్మికి ఆహారం తక్కువ పెట్టడం అనే విషయంలో తన వ్యతిరేకతను, అసంతృప్తిని భగవాన్ వ్యక్తం చేశారు అని అర్థమైంది.

మార్కెట్లో కొంత పశుగ్రాసాన్ని కొని ఆశ్రమంలో నిల్వచేశారు. తద్వారా గోలక్ష్మి, భగవాన్, వారు సాధారణంగా తీసుకునే ఆహారం తీసుకోవడానికి వీలు కలిగింది. పాపం లక్ష్మి! మూగ జీవి. ఏ మానవ భాషలోనూ మాట్లాడలేదు కదా! పశువులకు అర్ధాకలిగా ఆహారం పెడితే అవి అలాగే ఆకలితో మౌనంగానే ఉంటాయి. అవి ఎందుకు అర్ధాకలితో అలమటించాలి? ఎండాకాలం కదా అని మనకు మనం అర్ధాకలితో ఉంటామా? భగవాన్‌కు జంతువుల పట్ల గల జాగరూకత, పోషణ సంరక్షణ అత్యున్నత స్థాయిలో ఉంటాయి.

******

# శ్రీ రమణ మహర్షి సూక్తులు

కమలాకర వేంకటరావు

## జ్ఞానమంటే

జ్ఞానమంటే సత్యాన్ని అనుభూతం చేసుకోడమే. అది ధ్యానము వలననే సాధ్యమవుతుంది. ఇతర భావాలన్నింటినీ వర్జించి సత్యాన్ని అనుభూతము చేసుకోడానికి తోడ్పడుతుంది ధ్యానము.

## జ్ఞాని అకర్తృత్వం

దేహాత్మ బుద్ధిని అతిక్రమించినవాడే జ్ఞాని. జ్ఞానికి కర్తృత్వము లేదు. కర్మ లేదు. కాని అజ్ఞాని, జ్ఞానిని దేహిగానే చూస్తున్నందువల్ల, జ్ఞాని దేహము పనిచేస్తుంటే జ్ఞానే పని చేస్తున్నాడనుకొంటాడు.

## జ్ఞానిని తెలిపే లక్షణం

జ్ఞాని తత్వము జ్ఞానికే తెలుస్తుంది. జ్ఞానే మరియొక జ్ఞానిని అర్థము చేసుకోగలుగుతాడు. ఇతరులు జ్ఞానిని గుర్తించి అతని గొప్పతనము అర్థం చేసుకోవాలంటే, అతని పరిసరములో నిండుకొని ఉండే శాంతి ఒక్కటే అందుకు ఉపాయము. మాటలను బట్టీ, చేతలను బట్టీ అతని గొప్పదనము తెలియ వలను పడదు. అవి సామాన్యులు అర్థంముచేసుకోలేనివిగా ఉంటాయి.

## జ్ఞాని నిశ్చలత్వం

అతివేగంగా తిరిగే బొంగరము నిశ్చలంగా ఉన్నట్టు చూపులకు

కనిపిస్తుంది. కన్ను దాని వేగాన్ని అందుకోలేక పోవడమే ఇందుకు కారణము. అట్లే, జ్ఞాని నిశ్చలుడుగా కనిపించినా, ఆ నిశ్చలత్వము మాటున తీవ్రమైన కర్మణ్యత్వమున్నది. సామాన్య జనులది జడత్వమని పొరపాటు పడతారు.

## జ్ఞాని స్థితి - బాలుని స్థితి

జ్ఞానిని బాలునితో పోల్చారంటే, అతని స్థితి బాలుని స్థితిని పోలి ఉంటుందని అర్థం. బాలునియందు అహంకారము ఉండదు. అట్లే జ్ఞాని కూడ అహంకార వర్జితుడు. కాని, అంత మాత్రాన బాలుడు జ్ఞాని కానేరడు. జ్ఞానివలె బాలుడు జ్ఞాన ప్రబోధము కలుగ జెయ్యడు. బాలునిలో అహంకారము గుప్తమై ఉండి క్రమేణా అభివ్యక్తమౌతుంది. జ్ఞానిలో అది పూర్తిగా నశించిపోతుంది.

## జ్ఞాని మనస్సు

సూర్యుని వెలుగు ముందర చంద్రుడు చిన్న తెల్ల మబ్బు తునకవలె ఉంటాడు. జ్ఞాని మనస్సు కూడా ఇలా సూర్యుని వెలుగు ముందు ఇంద్రుని వంటిదే. ఉండడానికి ఉన్నా అది తన వెలుగును మాత్రము చూపుకోదు.

## జ్ఞాని - శారీరక బాధ

ఏదైనా పురుగు కుట్టితే, అజ్ఞానికి వలెనే జ్ఞాని దేహానికి గూడా బాధ ఉన్నట్లు కనబడవచ్చు. కాని దానిలో తేడా ఉన్నది. అజ్ఞాని

దేహమే తాననుకుంటాడు. జ్ఞాని సర్వమూ ఆత్మమయమని లేక సర్వమూ బ్రహ్మమని తెలుసుకొని ఉంటాడు. బాధవుంటే ఉపాధికి ఉండుగాక. అది గూడ ఆత్మలో భాగమే. ఆత్మ పరిపూర్ణము.

## జ్ఞాని స్థితి

జ్ఞాని స్థితి నిద్రకాదు, మెలకువా కాదు. రెండింటికీ మధ్యగా ఉండే స్థితి. మెలకువలోని ఎఱుక, నిద్రలోని ప్రశాంతి దానిలో ఉంటాయి. 'జాగ్రత్-సుషుప్తి' అన్నారు. మెలకువతో కూడిన నిద్ర, నిద్రతో కూడిన మెలకువ, నిద్ర లేని మెలకువ, మెలకువ లేని నిద్ర, - ఇలా దానిని ఏ విధంగా నైనా పిలవండి. విడివిడిగా అది నిద్రవంటిది గాని మెలకువ వంటిది గాని కాదు. అతి జాగ్రత్తు, లేక అతి సుషుప్తి అని కూడ దానిని పిలువవచ్చు. విశుద్ధమైన ఎఱుక, విశుద్ధమైన ప్రశాంతి, దానిలో మిళితమై ఉంటాయి.

## దేహజ్ఞానం సమాధి

దేహజ్ఞాన మున్నప్పుడు దేహ ముండాలి. దానికి పరిమితమైన జ్ఞానము ఉండాలి. రెండూ కలసి దేహజ్ఞానమవుతుంది. దీని కతీతంగా, స్వతంత్రమైన - నిరపేక్షమైన మరొక జ్ఞానము ఉన్నది. దాని నందుకోడమే సమాధి. దేహజ్ఞానము లేనప్పుడు ఉన్నప్పుడు కూడా అది ఉంటుంది. అది లభించినప్పుడు దేహ జ్ఞానము ఉంటే నేమి, లేకపోతే నేమి? ఉంటే అది బాహ్య సమాధి, లేకపోతే అది అంతస్సమాధి అవుతాయి.

## Right Thoughts Vs. Right Thinking

Dr K Subrahmanian

We all read about the tragedy in Maharashtra. The earthquake could have happened anywhere; it could have happened in Hyderabad. Some of you must have been terrified when your building shook. Those of us who ran out of our flats in the middle of the night realised how close to death we were. When such things happen, we understand how close we are to death every day, and how we miraculously escape it every day. When we hear that ten thousand or fifteen thousand people were killed within a matter of fifteen or twenty minutes, we are shocked about the uncertainty of life. It is also on occasions like this that we understand deeply our relationships with other people. The least that we can do in such circumstances is to quietly help those in distress.

Even at trying times like this, we wonder whether everything we give will reach the affected people. That is none of our business, for given the circumstances, we ourselves cannot personally go and hand over the collected items to the victims. We have to trust the volunteer organisations which have taken responsibility for this, and many of the reputable ones, do an outstanding job of distribution. The most important thing is not how much we can give, but how much we feel when giving. When something is given, it should be unconditional, and it will be unconditional when there is no sense of ego, and there's nobody there to say, "I have given it." Giving something

physically is easy; it is the mental giving that is not. That is, generosity of the hand is easy; generosity of the heart, however, is very difficult. We give with our hand, but many of us don't give with our heart, and that is why we try to find out how something we have given is being used. So, when giving something, we must do so unconditionally; once given, we must forget about what it is that we gave.

Except for great *jnanis*, most of us are all beggars because we are constantly asking God for things. Some of us beg for big things, and some of us, for small things. Only great *jnanis* don't ask for anything because they don't need anything. Yet, when we visit them, we take things for them; since they don't need anything, they distribute what has been offered to others. So, on occasions, like the present tragedy, when our hearts are moved, we must give whatever we can; once given, we must not worry about what we gave; we must learn to forget.

The people in our Kendram are extraordinary. Yesterday, I had asked for old clothes, and by this morning, we had collected almost eighteen bundles. I rang up my friend in the Railways, and he picked them up in his car. Nobody asked how the clothes and the other things were going to be transported from Secunderabad to the place in Maharashtra. They didn't ask because they must have been deeply struck by the tragedy, and so they gave without thinking too much. This is real giving. It is not how much we give that is important, but with what feeling we give.

*shraddhaya deyam asratdhaya adeyam*

Whatever we give, must be given with great *shraddha*; we must not be disrespectful to the person we are giving to. In other words, there should be humility in giving; when we give, we must give as if we are receiving.

*shriya deyam hriya deyam*

